ఇప్పట్లో రిటైర్ కాను

పుకార్లను అసలు పట్టించుకోను కెప్టెన్సీపై రోహిత్‌శర్మ స్పష్టత

సిడ్నీ: భారత స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ..తన రిటైర్మెంట్ వార్తలపై స్పష్టత ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో ఆఖరి టెస్టులో అనూహ్యంగా తప్పించడంపై రోహిత్ తనదైన శైలిలో స్పందించాడు. గత కొన్ని రోజులుగా వస్తున్న వరుస కథనాలకు హిట్‌మ్యాన్ చెక్ పెట్టాడు. రెండో రోజు ఆటలో విరామం సందర్భంగా రోహిత్ వ్యాఖ్యాలతో మాట్లాడుతూ 'నేను ఇప్పట్లో రిటైర్ కాను. ఫామ్‌లో లేను కాబట్టే చివరి టెస్టు నుంచి తప్పుకున్నాను. అంతేకానీ వేరే ఉద్దేశం లేదు. ఫామ్‌లో లేని ప్లేయర్‌ను ఏ జట్టు మోయలేదు. అందుకే నా స్థానంలో మెరుగైన ప్రదర్శన కనబరిచే ప్లేయర్ అవకాశం ఇచ్చారు. ఇదే విషయాన్ని కోచ్, మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లాను. అంతేకానీ రిటైర్ అవుతున్నట్లు కొందరు అదే పనిగా వార్తలు రాస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు రాయడం సరైంది కాదు' అని అన్నాడు. అయినా తాను ఇక్కడికి వచ్చింది విశ్రాంతి తీసుకోవడానికి కాదు ఆడటానికే. సిడ్నీ టెస్టు నుంచి వైదొలుగాలనే నిర్ణయం కఠినమైనదైనా..జట్టు అవసరాల కోసం ఇది తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. '2007లో తొలిసారి డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చినప్పటికీ ఇప్పటి వరకు మ్యాచ్ గెలువాలనే చెబుతుంటాను. కొన్నిసార్లు జట్టుకు ఏం అవసరమో మనం అర్థం చేసుకోవాలి. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా మనం మారాల్సి ఉంటుంది. ఫామ్‌లో లేకుండా జట్టులో కొనసాగడం సరైంది కాదు. జట్టుకు ఏది లాభిస్తుందో అది చేయాలి'అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు. మరోవైపు పుకార్లపై స్పందిస్తూ 'ఎవరో ఏదో అనుకుంటున్నారని ఆలోచించే వ్యక్తిని కాదు. విమర్శల వల్ల కెప్టెన్సీ పద్ధతి మార్చుకోలేను. నా ఆట పై, కెప్టెన్సీపై ఎలాంటి అనుమానం లేదు. కెప్టెన్సీ విషయంలో పద్ధతి మార్చుకోవడం లేదు. కొన్నిసార్లు నిర్ణయాలు తప్పు కావచ్చు. బుమ్రా తర్వాత కెప్టెన్ ఎవరో ఇప్పుడే చెప్పలేను. కాలమే నిర్ణయిస్తుంది. చాలా మంది యువకులు క్యూలో ఉన్నారు. సీనియర్ల నుంచి నేర్చుకుంటూ వాళ్లు మరింత ముందుకు సాగాల్సి ఉంటుంది' అని అన్నాడు. అయి నా భారత కెప్టెన్‌గా వ్యవహరించడం అంత సులువు కాదన్న రోహిత్..అదోక గౌరవంగా భావిస్తానని స్పష్టం చేశాడు.

పంత్ (61)

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య సిడ్నీ వేదికగా ఐదో టెస్టు రసపట్టులో పడింది. ఆధిక్యం చేతులు మారుతున్న మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై బౌలర్లు వికెట్ల పండుగ చేసుకుంటున్నారు. రెండో రోజైన శనివారం ఆటలో 15 వికెట్లు నేలకూలాయి. బోలాండ్ ధాటికి టీమ్‌ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 141 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. రిషబ్ పంత్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో కంగారూలకు ముచ్చెమటలు పట్టించాడు. టాపార్డర్ మరోమారు ఘోరంగా విఫలంకాగా,పంత్ ఒంటరిపోరాటం జట్టుకు కలిసొచ్చింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా పంత్ కొట్టిన షాట్లకు కిక్కిరిసిన సిడ్నీ స్టేడియం హోరెత్తిపోయింది. అంతకుముందు ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, నితీశ్, బుమ్రా విజృంభణతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు పరిమితమైంది. అరంగేట్రం బ్యాటర్ వెబ్‌స్టర్ అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు విఫలమయ్యారు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న టీమ్‌ఇండియా ప్రస్తుతం 145 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. మూడు రోజుల ఆట మిగిలున్న మ్యాచ్‌లో విజయం ఎవరిదో అన్నది ఆసక్తికరగా మారింది.

రసపట్టులో..

హోరాహోరీగా భారత్, ఆసీస్ సిడ్నీ పోరు

పంత్ ధనాధన్ ఇన్నింగ్స్

రెండో ఇన్నింగ్స్ 141-6 ● రాణించిన సిరాజ్, ప్రసిద్ధ్, నితీశ్ ● ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 181 ఆలౌట్

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో ఆఖరిదైన ఐదో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. మ్యాచ్‌కు ముందే ఆసక్తి రేపిన పోరులో భారత్, ఆస్ట్రేలియా తుదికంటా పోరాడుతున్నాయి. మ్యాచ్ గెలిచి సిరీస్ డ్రా చేయడం ద్వారా బీజీటీ ట్రోఫీని నిలబెట్టుకోవడంతో పాటు డబ్ల్యూటీసీ టోర్నీ రేసులో నిలువాలని టీమ్‌ఇండియా పట్టుదలతో ఉంది. మరోవైపు గత రెండు పర్యాయాలు సిరీస్ కోల్పోయిన ఆసీస్ ఈసారి ఎలాగైనా కసితీర్చుకోవాలని చూస్తున్నది. తద్వారా డబ్ల్యూటీసీకి బెర్తు దక్కించుకోవాలన్న ఆరాటంతో ఉంది. ఈ నేపథ్యంలో రెండు జట్లు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. వికెట్‌కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్(33 బంతుల్లో 61, 6ఫోర్లు, 4సిక్స్‌లు) సుడిగాలి అర్ధసెంచరీతో రాణించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 141-6 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు రాహుల్(13), గిల్(13), కోహ్లీ(6) మరోమారు విఫలమైన వేళ తాను ఉన్నానంటూ పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ క్రమంలో భారత్ తరఫున రెండో వేగవంతమైన(29 బంతుల్లో) అర్ధసెంచరీ రికార్డును పంత్ తన పేరిట లిఖించాడు. జడేజా(8), సుందర్(6) క్రీజులో ఉన్నారు. స్కాట్ బోలాండ్(4-42) టీమ్‌ఇండియా పతనాన్ని శాసించాడు. కమిన్స్, వెబ్‌స్టర్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 9-1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 181 పరుగులకు ఆలౌటైంది. వెబ్‌స్టర్(105 బంతుల్లో 57, 5ఫోర్లు), స్మిత్(33) ఆకట్టుకున్నారు. పిచ్ పరిస్థితులకు అనుకూలంగా మలుచుకుంటూ ప్రసిద్ధ్ కృష్ణ(3-42), సిరాజ్(3-51), నితీశ్(2-32), బుమ్రా(2-33) ఆసీస్ పతనంలో కీలకమయ్యారు. సీనియర్లు విఫలమైన చోట ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే వెబ్‌స్టర్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు.

పంత్ ఫటాఫట్:

నాలుగు పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియాకు ఓపెనర్ యశస్వి జైస్వాల్(22) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. స్టార్క్ తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ బౌండరీలతో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. స్టార్క్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ జైస్వాల్ చూడచక్కని షాట్లతో అభిమానులను అలరించాడు. అయితే మరో ఎండ్‌లో రాహుల్ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకున్న రాహుల్..జైస్వాల్‌కు తోడ్పాటు అందించాడు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన బోలాండ్..రాహుల్‌ను సూపర్ స్వింగ్‌తో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక్కడి నుంచి మన పతనానికి నాంది పడింది. ఐదు పరుగుల తేడాతో రాహుల్‌ను అనుసరిస్తూ జైస్వాల్ కూడా బౌల్డ్ కావడంతో 47 పరుగులకే టీమ్‌ఇండియా ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. రోహిత్‌శర్మ స్థానంలో జట్టులోకి వచ్చిన గిల్(13) తన వికెట్ విలువను గుర్తించలేకపోయాడు. క్రీజులో నిలదొక్కుకోవాల్సింది పోయి అనవసరంగా వికెట్ సమర్పించుకున్నాడు. వెబ్‌స్టర్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయిన గిల్...కీపర్ క్యారీ క్యాచ్‌తో ఔటయ్యాడు. గిల్ కంటే ముందు బోలాండ్ మరోమారు భారత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్ బంతిని ఆడబోయిన కోహ్లీ..స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఈ సిరీస్‌లో ఏకంగా ఎనిమిదోసారి కోహ్లీ ఇదే శైలిలో వికెట్ ఇచ్చుకోవడం విశేషం. దీంతో 78 పరుగులకే టీమ్‌ఇండియా కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పంత్..స్టార్క్ బౌలింగ్‌లో తొలి బంతినే కండ్లు చెదిరే రీతిలో సిక్స్ కొట్టి ఔరా అనిపించాడు. తన బ్యాటింగ్ శైలిపై వస్తున్న విమర్శలకు పంత్ అదే రీతిలో సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో, తన ట్రేడ్‌మార్క్ షాట్లు ఆడుతూ ఆసీస్ బౌలర్లను కంగారెత్తించాడు. పంత్ బ్యాటింగ్ ధాటికి ఒక దశలో కెప్టెన్ కమిన్స్ బౌండరీల వద్ద ఆరుగురు ఫీల్డర్లను మోహరించాల్సి వచ్చింది. ఏ మాత్రం ఒత్తిడికి గురికాని పంత్..భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వెబ్‌స్టర్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌లు కొట్టిన పంత్..29 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. ఇక ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో కమిన్స్ బంతిని షాట్ ఆడబోయిన ఈ హార్డ్‌హిట్టర్ కీపర్ క్యాచ్‌తో వెనుదిరగాల్సి వచ్చింది. అప్పటి వరకు హోరెత్తిన స్టేడియం పంత్ ఔట్ కావడంతో నిశ్శబ్దం ఆవరించింది. ఆ తర్వాత వచ్చిన నితీశ్(4) మరోమారు ఘోరంగా విఫలమయ్యాడు.

కృష్ణ, సిరాజ్ అదుర్స్:

టీమ్‌ఇండియా బౌలర్లు సమిష్టి ప్రదర్శన కనబరిచారు. పిచ్‌ను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ఆసీస్ బ్యాటర్లను కంగారెత్తించారు. లబుషేన్(2)ను బుమ్రా ఔట్ చేయడం ద్వారా ఆసీస్ పతనానికి తెరలేచింది. దూకుడు మీద కనిపించిన కాన్‌స్టాస్(23)ను సిరాజ్ పెవిలియన్ సాగనంపాడు. లంచ్ విరామం తర్వాత బుమ్రా గాయంతో డగౌట్ చేరడంతో బౌలింగ్ భారాన్ని సిరాజ్, కృష్ణ మోయాల్సి వచ్చింది. వీరిద్దరికి కోహ్లీ అండగా నిలిచాడు. బ్యాటర్లకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తూ వికెట్ల వేట కొనసాగించాడు. సహచర బ్యాటర్లు విఫలమైనా అరంగేట్రం బ్యాటర్ వెబ్‌స్టర్ జట్టును ఆదుకున్నాడు. ఆఖరి వరస బ్యాటర్లతో కలిసి కీలక పరుగులు జోడించాడు. చివర్లో నితీశ్..కమిన్స్(10), స్టార్క్(1)ను ఔట్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్‌కు ముగింపు పడింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185 ఆలౌట్, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181 ఆలౌట్, భారత్ రెండో ఇన్నింగ్స్: 141-6(పంత్ 61, జైస్వాల్ 22, బోలాండ్ 4-42, వెబ్‌స్టర్ 1-24)

బుమ్రాకు గాయం!

సిడ్నీ: భారత తాత్కాలిక కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో ఐదో టెస్టు రెండో రోజు ఆటలో బుమ్రా వెన్నునొప్పికి గురవ్వడం ఒకింత ఆందోళనకు గురి చేసింది. భోజన విరామం తర్వాత ఒక ఓవర్ వేసిన బుమ్రా వెంటనే మైదానాన్ని వీడాడు. బుమ్రా స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ ఫీల్డింగ్‌కు రాగా విరాట్ కోహ్లీ స్టాండింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టు వైద్య సిబ్బందితో కలిసి బుమ్రా స్కానింగ్ పరీక్షలకు వెళ్లాడు. అయితే మ్యాచ్ జరుగుతున్నప్పుడే తిరిగి స్టేడియానికి చేరుకున్న స్టార్ స్పీడ్‌స్టర్ గాయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 'ముందస్తు జాగ్రత్తగా బుమ్రా స్కానింగ్ పరీక్షలు నిర్వహిం చాం. అతను బ్యాటింగ్ చేసేందుకు పెద్దగా ఇబ్బందేమి లేదు. కానీ బౌలింగ్ చేయాలా వద్దా అనేది ఆదివారం తేలుతుంది' అని జ ట్టు వర్గాలు పేర్కొన్నాయి. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో ప్రస్తుతం బుమ్రా టాప్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు. ఆసీస్ బ్యాటర్లకు కొరకరాని కొయ్యగా వికెట్ల వేట సాగిస్తున్నా డు. ఒక వేళ గాయం తీవ్రతతో బౌలింగ్‌కు రాకపోతే..భారత గెలుపు అవకాశాలపై కచ్చితంగా ప్రభావం చూపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ షూటర్స్ శభాష్

డీజీపీ జితేందర్ అభినందనలు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ): నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్-24లో సత్తా చాటిన తెలంగాణ పోలీసు షూటర్స్‌ను రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయం లో వారికి పుష్పగుచ్చాలు, శాలువాలతో సత్కరించారు. జాతీయ షూటిం గ్ పో టీల్లో 25మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో నారాయణదాసు, రైఫి ల్ ప్రోన్ వ్యక్తిగత కేటగిరీలో సువర్ణ కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ మహేశ్ భగవత్, స్పోర్ట్స్ ఐజీజీ రమేశ్ పాల్గొన్నారు.

కుబేర ఆగమనానికి రంగం సిద్ధం?

'లవ్‌స్టోరీ' తర్వాత శేఖర్ కమ్ముల ప్రకటించిన సినిమా 'కుబేర'. 'ధనుష్ హీరోగా, అక్కినేని నాగార్జున కీలక పాత్రలో ఈ సినిమా రూపొందుతున్నది' అనే ప్రకటన వెలువడిన మరుక్షణమే సినిమాపై బజ్ ఓ స్థాయిలో క్రియేటయ్యింది. ఈ సినిమా మొదలై దాదాపు రెండేళ్లు కావొస్తున్నది. షూటింగ్ కూడా నిదానంగా సాగుతున్నది. ఈ సినిమా ప్రకటించిన తర్వాత ధనుష్ నుంచి 'సార్' , 'రాయన్' సినిమాలు విడుదలయ్యాయి. 'ఇడ్లీ కడై' కూడా ఏప్రిల్ 10న విడుదల కానున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దాంతో 'కుబేర' రిలీజ్ ఎప్పుడవుతుంది? అనేది ప్రేక్షకులకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అయితే.. లేటెస్ట్ బజ్ ప్రకారం 'కుబేర' రిలీజ్ డేట్ లాక్ అయినట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది జూన్ 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. సునీల్ నారంగ్, పుస్కూరు రామ్మోహన్‌లతో కలిసి శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.

నమో నమః శివాయ

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' చిత్రం నుంచి శివుడి నేపథ్యంలో భక్తి ప్రధానంగా తెరకెక్కించిన 'నమో నమః శివాయ' పాటను శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరి 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. 'నమో నమః శివాయ' పాటకు దేవిశ్రీప్రసాద్ స్వరాల్ని సమకూర్చగా, జొన్నవిత్తుల సాహిత్యాన్ని అందించారు. అనురాగ్ కులకర్ణి, హరిప్రియ ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతుల్ని అందించారు. కళాత్మక, ఆధ్యాత్మికత కలబోతగా మహా శివుడి నామస్మరణతో ఈ పాట భక్తి భావాలను మేల్కొలిపే విధంగా సాగింది. నాగచైతన్య, సాయిపల్లవి చక్కటి నృత్యాలతో మెస్మరైజ్ చేశారు. సర్వశక్తివంతుడైన శివుడి ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాటను తెరకెక్కించామని, సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ప్రేమ, దేశభక్తి ప్రధానాంశాలుగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: గీతా ఆర్ట్స్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

చిత్రం

హీరోలు నమస్కారాలు పెట్టాల్సిన పనిలేదు

'సినిమాకు రాజకీయ రంగు పూయడం మాకు ఇష్టంలేదు. దయచేసి చిత్రపరిశ్రమకు నేను చెప్పేది ఒక్కటే.. పరిశ్రమ సాధక బాధకాలు తెలిసినవాళ్లే మాట్లాడండి. అలాంటివారితోనే మా ప్రభుత్వం కూడా మాట్లాడుతుంది. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడటానికి నిర్మాతలు రండి. హీరోలొచ్చి నమస్కారాలు పెట్టాల్సిన పనిలేదు. నటరత్న ఎన్టీఆర్ ఔన్నత్యం మాలో ఉంది.. గర్తుంచుకోండి' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం రాజమండ్రి సమీపంలోని వేమగిరిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడారు. 'అడగ్గానే టికెట్ రేట్లు ఎందుకు పెంచాలి? అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. డిమాండ్‌ని బట్టి సప్లై ఉంటుంది. శంకర్ గారి సినిమాలను చెన్నైలో నేనే బ్లాక్‌లో కొని చూశా. తొలిరోజు టికెట్‌కి డిమాండ్ ఉంటుంది. మరోవైపు బడ్జెట్ పెరిగింది. తెలుగు సినిమా విశ్వవ్యాప్తం అయింది. టికెట్ రేట్లు పెంచితే తప్పేముంది? పెరిగిన ప్రతి రూపాయికీ 18శాతం జీయస్టీ కడుతున్నాం. ఊరకే ఇవ్వడంలేదు. దీనిపై తప్పుగా ప్రచారం చేస్తున్నారు. టికెట్ రేట్లు పెరిగితే ప్రభుత్వానికే ఆదాయం' అని పవన్ తెలిపారు. 'రామ్‌చరణ్ ఇంతపెద్ద నటుడు అవుతాడని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటాడనీ మేం ఎవరం ఊహించలేదు. మెగాస్టార్ కొడుకు గ్లోబల్‌స్టారే అవుతాడు అని నిరూపించాడు. శంకర్‌గారి సినిమాలను ఇష్టంగా చూసేవాడ్ని. ఈ రోజు రామ్‌చరణ్, తారక్, రాజమౌళి.. వీరంతా ఇంటర్నేషనల్ స్థాయికి వెళ్లారంటే దానికి కారకులైన దర్శకుల్లో శంకర్ ఒకరు. అంత గొప్ప దర్శకుడు.. 'గేమ్‌ఛేంజర్'ని తెలుగులో తీయడం ఆనందించదగ్గ విషయం. ఇది సోషల్ మెసేజ్ ఉన్న సినిమా అని అర్థమవతుంది. సినిమా అంటే విలువలుండాలి. హీరోలు మంచి చెప్పాలి. బాధ్యతగా ఉండాలి. వినోదంతోపాటు ఆలోచింపజేసే సినిమాలు రావాలి. శంకర్ సినిమాలు అలాగే ఉంటాయి' అని పవన్‌కల్యాణ్ అన్నారు. తన 'తొలిప్రేమ' డిస్ట్రిబ్యూటరైన దిల్‌రాజు ఆ తర్వాత తన 'పకీల్ సాబ్' నిర్మాతగా ఎదిగారని, నిర్మాతగా తనిచ్చిన డబ్బే తన జనసేన పార్టీకి ఇంధనమైందని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. 'పబ్లిక్ ఫంక్షన్ అంటే ఈ టైమ్‌లో పెట్టొచ్చా లేదా అని ఆలోచించా. మూడేళ్లు కష్టపడి సినిమా తీశారు. కోట్లు కుమ్మరించారు. అలాంటి సినిమాను బలంగా జనాల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది. అందుకే ఓకే చెప్పా. ఇప్పటికీ భయంగానే ఉంది. మీరంతా క్షేమంగా ఇంటికెళ్లాలి. ఆనందంగా చేసుకునే ఈ వేడుక విషాదం కాకూడదు. సినిమాను సినిమాగా చూడండి. ఇంట్లోవాళ్లను బాధపెట్టొద్దు' అని పవన్‌కల్యాణ్ హితవు పలికారు. ఏపీ రాజకీయాలు మార్చిన గేమ్‌ఛేంజర్ పవన్‌కల్యాణ్‌గారు ఈ వేడుకకు రావడం మరిచిపోలేని అనుభవమని రామ్‌చరణ్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా దర్శకుడు శంకర్, దిల్‌రాజు తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

సిద్ధాంతం కోసం కట్టుబడే వ్యక్తి కథ

'ఈ సినిమాలో నేను చేసిన సిద్ధార్థ్ క్యారెక్టర్ హార్ట్ టచింగ్‌గా ఉంటుంది. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఉండే క్యారెక్టర్ ఇది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఈ పాత్ర ఉంటుంది. దర్శకుడు కరుణ్ కథ ఎంత అద్భుతంగా చెప్పాడో, అంత గొప్పగా తీశాడు. ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నాం. దర్శకుడు కరుణ్ కోసమైనా ఈ సినిమా హిట్ కావాలి. ఇది వినోదంతో సాగే ఇంటెన్స్ లవ్‌స్టోరీ. 'క' తర్వాత వస్తున్న ఈ సినిమా తప్పకుండా అంచనాలను అందుకుంటుంది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకుడు. రవి, జోజో సోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడారు. ఇందులో కొత్త కిరణ్ అబ్బవరాన్ని చూస్తారని నిర్మాతలు తెలిపారు. అందరి జీవితాల్లోని ప్రేమను స్ఫూర్తిగా తీసుకొని ఈ సినిమా రూపొందించానని, కిరణ్ అబ్బవరం సహకారం వల్లే ఈ సినిమా చేయగలిగానని దర్శకుడు చెప్పారు.

సీఎం కావాలనుకుంటున్నా!

ఓ కథానాయిక ఇరవైఏండ్లకుపైగా స్టార్‌డమ్‌ను కాపాడుకోవడం నేటి తరంలో అంత సులభం కాదు. కానీ త్రిష ఆ ఘనతను సాధించింది. తన సమకాలీన నాయికలు చాలా మంది సినిమాలకు గుడ్‌బై చెప్పి వైవాహిక జీవితంలో స్థిరపడగా, త్రిష మాత్రం ఇప్పటికీ తిరుగులేని ఇమేజ్‌తో కెరీర్‌లో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఐదు భారీ చిత్రాల్లో నటిస్తుందంటే ఆమె క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇది లావుండగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం కావాలన్నది తన బలమైన కోరికని త్రిష చెప్పింది. ప్రజాసేవతో పాటు సామాజిక మార్పులు రాజకీయాల వల్లే సాధ్యమని అభిప్రాయపడింది. ఆమె వ్యాఖ్యలు తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆ మాటల వెనక మతలబు ఏంటోనని చర్చ నడుస్తున్నది. త్రిష వంటి సూపర్‌స్టార్‌డమ్ ఉన్న కథానాయిక రాజకీయ కోణంలో చేసిన వ్యాఖ్యలను అంత ఈజీగా కొట్టి పారేయలేమని విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాట రాజకీయాలు, సినిమాలకు విడదీయరాని సంబంధం ఉన్న విషయం తెలిసిందే. అగ్ర హీరో దళపతి విజయ్ సైతం సినిమాల నుంచి తప్పుకొని సొంత పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో త్రిష వ్యాఖ్యలు తమిళ నాట ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ 'కలవరం'

విజయ్ కనిష్క, గరిమ చౌహాన్ జంటగా నటిస్తున్న 'కలవరం' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హనుమాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సీఎల్ఎన్ మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ముహూర్తపు సన్నివేశానికి సి.కల్యాణ్ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. కొత్తదనంతో కూడుకున్న కథతో తెరకెక్కిస్తున్నాం. యువత మెచ్చే అన్ని అంశాలుంటాయి' అన్నారు. వినోదం, భావోద్వేగాలు ప్రధానంగా అందరిని ఆకట్టుకునే చిత్రమిదని నిర్మాత శోభారాణి పేర్కొన్నారు. సున్నితమైన భావోద్వేగాలతో సాగే ప్రేమకథా చిత్రమిదని కథా రచయిత శశాంక్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకటేష్, సంగీతం: వికాస్ బాడిస, దర్శకత్వం: హనుమాన్ వాసంశెట్టి.

దేవుడు నాకు పని ఎక్కువిచ్చాడు !

'నేను కళాకారుడ్ని. ప్రజలతో మమేకమై ఉంటాను. వాళ్లకేం కావాలో వాళ్ల దగ్గరి నుంచే తీసుకొని, తిరిగి వాళ్లకే ఇస్తుంటాను. ప్రస్తుతం నేనున్న స్థాయి నా క్రెడిట్ అని మాత్రం నేను అనుకోను' అంటున్నారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. ప్రస్తుతం లీడింగ్‌లో ఉన్న మ్యూజిక్ డైరెక్టర్లలో ఈయన కూడా ఒకరు. ఇటీవల బలగం, ధమాకా, మ్యాడ్ చిత్రాలు సంగీత దర్శకునిగా భీమ్స్‌కు మంచి పేరుతెచ్చాయి. వెంకటేశ్ హీరోగా అనిల్‌రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన 'సంక్రాతికి వస్తున్నాం' సినిమాకు భీమ్స్ సంగీతం అందించారు. ఈ నెల 14న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం భీమ్స్ విలేకరులతో ముచ్చటించారు. '13ఏళ్ల క్రితం అనిల్ రావిపూడితో 'పటాస్' సినిమాకు పనిచేశాను. మళ్లీ ఇన్నాళ్లకు 'సంక్రాంతికి వస్తున్నాం'కి పనిచేశాను. ఈ అవకాశం రావడం, ఆల్బమ్ పెద్ద హిట్ అవ్వడం, వెంకటేశ్ నా ఆల్బమ్‌లో పాట పాడటం, రమణగోగుల నా మ్యూజిక్ డైరెక్షన్‌లో పాడేందుకు ఒప్పుకోవడం ఇవన్నీ తిరుమల శ్రీవారి కృప వల్లే సాధ్యమైంది. ప్రస్తుతం ఈ సినిమా పాట